
ఎలిగేడు: ధూళికట్ట ఊరచెరువు రోడ్డుపై వరద ప్రవాహం


ధర్మారం: కానంపెల్లి లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వర్షం నీరు


సుల్తానాబాద్‌రూరల్: కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై..


పెద్దపల్లిరూరల్: వెంకట్రావుపల్లి రోడ్డు..

ముంచెత్తిన వాన

- రాకపోకలకు అంతరాయం
- ఇళ్లలోకి చేరిన వరదనీరు

పెద్దపల్లిరూరల్: భారీ వర్షాలతో పెద్దపల్లి జలమయమైంది. పట్టణంలోని రోడ్లతో పల్లెల్లోని రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. పెద్దపల్లి మండలం దస్తగిరిపల్లి- కొత్తపల్లి గ్రామాల మధ్య లోలెవల్ కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహించింది. పెద్దపల్లి పోలీస్‌స్టేషన్ చెరువును తలపించింది. నిట్టూరు, పెద్దబొంకూర్ తదితర గ్రామాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.

జిల్లాలో వర్షపాతం వివరాలివీ..

జిల్లాలో ఆదివారం నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లిలో 71.5 మిమీ వర్షపాతం నమోదు కాగా, సుల్తానాబాద్‌లో 101.3, ఎలిగేడులో 88.5మిమీ, కాల్వశ్రీరాంపూర్‌లో 82.3మిమీ, జూలపల్లిలో 63.0, ఓదెలలో 51.8, ధర్మారంలో 51.3, అంతర్గాంలో 48.0, కమాన్‌పూర్‌లో 46.3, పాలకుర్తిలో 41.0, మంథనిలో 37.0, రామగిరిలో 30.8 మిమీ. వర్షపాతం నమోదైంది.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నీరుకుల్ల మానేరువాగులో చెక్‌డ్యాం, గర్రెపల్లి పెద్ద చెరువు వరద నీటితో మత్తడి దూకుతున్నాయి. రేగడిమద్దికుంటలో ఇళ్లలోకి వరద నీరు చేరింది. కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఐతరాజుపల్లికి చెందిన బైక్ వాహనదారుడు అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సుబ్బారెడ్డి, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ సూచించారు.

సుల్తానాబాద్: పెద్దపల్లి నుంచి సుల్తానాబాద్‌కు వెళ్లే రహదారి ఆదివారం కురిసిన వర్షానికి జలమయమైంది. సుగ్లాంపల్లి, స్వప్నకాలనీ ఇరువైపులా రాజీవ్ రహదారిపై నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమై జేసీబీ సహకారంతో నీటిని తొలగించారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో వరద బాధితులు అవసరం కోసం హెల్ప్ నంబర్లు 7702810811, 9949125034, 7980163760ను సంప్రదించాలని కోరారు.

ధర్మారం: మండలంలోని కానంపెల్లి గ్రామ శివారులోని లోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించటంతో రాకపోకలు నిలిచాయి.

నీట మునిగిన రైల్వేఅండర్ బ్రిడ్జిలు

ఓదెల: కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో ఓదెల, ఉప్పరపల్లె లోని రైల్వేఅండర్‌బ్రిడ్జిలు నీటిమయం అయ్యాయి. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రైల్వేఅండర్‌బ్రిడ్జిలు జలమయం కావటంతో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, గూడ్స్ రైళ్లన్నీ ఆలస్యంగా నడిచాయి. దీనితో రైల్వే అండర్‌బ్రిడ్జిల వద్ద రైల్వేసిబ్బంది అలర్ట్ అయ్యారు.

కాల్వశ్రీరాంపూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, ఒర్రెలు పొంగిపొర్లుతున్నాయి. వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. మీర్జంపేట గ్రామానికి చెందిన చల్ల సారయ్య ఇల్లు కూలింది. జాగ్రత్తగా తహసీల్దార్ శంకర్ సూచించారు.

ఓదెల: మండలంలోని కొలనూర్, గోపరపల్లె, పొత్కపల్లి గుంపుల, గూడెం గ్రామాల్లోని పంటపొలాలు మునిగాయి. మడక, కనగర్తి గ్రామాల మీదుగా గుంపుల వెళ్లే మానేరు ప్రవాహం పెరిగింది.

ఓదెల: మండలంలోని కొమిరలో కొలిపాక మల్లమ్మకు చెందిన నివసిస్తున్న ఇల్లు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఆదివారం కూలింది.

కమాన్‌పూర్: మండల పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. గుండారం రిజర్వాయర్‌తో పాటు చెరువుల్లోకి వరదనీరు చేరుతుండడంతో అలుగులు పారుతున్నాయి.

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో హుస్సేన్ మియా వాగుకు వరద ఉధృతి పెరగడంతో వడ్కాపూర్, ధూళికట్ట మధ్య ఉన్న హుస్సేన్‌మియా వాగులో లోలెవల్ వంతెన మునగడంతో రాకపోకలు నిలిచారు. అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు బషీరుద్దీన్, ఎస్సై శ్రీధర్ సూచించారు.


ఎలిగేడు: నారాయణపల్లిలో..


ఓదెల: నక్కలవాగు వంతెన వద్ద వరద ఉధృతి


ధర్మారం: రచ్చపల్లి-రామయ్యపల్లి గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద


కాల్వశ్రీరాంపూర్: పెద్దరాతుపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న హుస్సేన్‌మియా వాగు


సుల్తానాబాద్‌రూరల్: రేగడిమద్దికుంటలో..


ఓదెల: కొలనూర్‌లో ఇంట్లోకి చేరిన వరద


ఓదెల: కొలనూర్ రైల్వే కల్వర్టు దగ్గర వరద ఉధృతి


సుల్తానాబాద్‌లో రాజీవ్ రహదారిపై వరద


జూలపల్లి: వడ్కాపూర్-ధూళికట్ట బ్రిడ్జి వద్ద హుస్సేన్‌మియా వాగు


కమాన్‌పూర్: ఇళ్ల మధ్యలో నిలిచిన వరదనీరు

క్లుప్తంగా

అక్రమ షెడ్ల తొలగింపు


తొలగించిన సామగ్రి మున్సిపల్ ట్రాక్టర్‌లో వేస్తున్న సిబ్బంది

మంథని: మున్సిపాలిటీ పరిధిలో పలు అక్రమ షెడ్లను మున్సిపల్ సిబ్బంది ఆదివారం తొలగించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి శ్రీపాదచౌక్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న రేకుల షెడ్లు, ఫ్లెక్సీలను తొలగించారు. బొక్కల వాగు వంతెన నుంచి బస్టాండ్ వరకు ట్రాఫిక్ సమస్య తలత్తడంతో రోడ్డుపై ఉన్న తాత్కాలిక షెడ్లను తొలగించారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పాలకుర్తి: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు సీపెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన పంచాయతీ కార్మికుల మండల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ హయంలో పంచాయతీ కార్మికుల సమస్యల సాధనకై చేపట్టిన నిరవధిక సమ్మె సందర్భంగా మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పంచాయతీ కార్మికుల సమస్యలు విస్మరించిందని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు రామస్వామి, నాయకులు కట్ల స్వామి, కర్రావుల కృష్ణయ్య, నరసింహారాజు, సారయ్య, కనకయ్య, గణేశ్ పాల్గొన్నారు.

ఆలయంలో రుద్రాభిషేకం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో కొమరవెల్లి నవ్య-సురేశ్ దంపతులు మాస శివరాత్రి పురస్కరించుకొని రుద్రాభిషేకం నిర్వహించారు. ఆదివారం చివరి శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అన్నపూజతో పాటు క్షీరాభిషేకం చేశారు. భక్తులకు పూజారి మహేశ్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, వ్యాపారవేత్తలు కొమురవెల్లి సాయిరాం, జ్యోతి, చిట్టిమల్ల వినయ్‌కుమార్, వర్షిత, కొమురవెల్లి పద్మ, మురళీధర్ ఉన్నారు.

స్వాతంత్ర్య యోధులను స్మరించుకుందాం


నివాళి అర్పిస్తున్న సమరయోధుల వారసులు

పెద్దపల్లిరూరల్: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన తెలంగాణ యోధుల త్యాగాలు వెలకట్టలేనివని స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలసాని వెంకటేశం అన్నారు. ప్రతీ నెల తొలి ఆదివారం దేశవ్యాప్తంగా వారసుల సంఘం ఆధ్వర్యంలో దేశభక్తులను స్మరించుకుంటూ ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు కోల వెంకటేశ్వర్‌రావు, ఆనందరావు, శ్రీనివాస్, గోపి, రమేశ్‌బాబు, కృష్ణ, రాము ఉన్నారు.

వాసవీక్లబ్ ఫౌండర్ జయంతి ఉత్సవాలు


ఫౌండర్ కేసీ గుప్తా చిత్రపటానికి పూలమాల వేస్తున్న సత్యం

ధర్మారం: మండల కేంద్రంలో వాసవీ క్లబ్ ఫౌండర్ కేసీ గుప్తా జయంతి ఉత్సవాలు ఆదివారం వాసవీక్లబ్ ధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవిచంద్రన్, ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు సిరిపురం సత్యనారాయణ హాజరయ్యారు. క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, రక్తదానం, టీచర్లు, పత్రికా విలేకర్లు, విద్యుత్తు శాఖ ఇంజనీర్లను సన్మానించారు. జిల్లా గవర్నర్ మాధవి, ఎలగందుల అశోక్, బీరెల్లి రాము, కిషోర్, శ్రీనివాస్, ధర్మారం వాసవీక్లబ్ అధ్యక్షుడు తాటిపెల్లి వంశీ, కార్యదర్శి శివ, కోశాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

జూలపల్లి: మండలంలోని తేలుకుంట గ్రామ ట్రాక్టర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా సైన్యం వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా తీగెల మహిపాల్, కోశాధికారిగా తీగెల చందు, కార్యవర్గ సభ్యులుగా కట్ల నరేశ్, గుజ్జెటి కనకశేఖర్ ఎన్నికయ్యారు.

రూరల్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తాం

గోదావరిఖని: రెండు పవర్ ప్లాంట్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో పాటు పలు అభివృద్ధి పనులకు బీజం పడటం ఉత్తర తెలంగాణాలోనే చారిత్రాత్మక నిర్ణయమని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ముందుకు సాగుతున్నామన్నారు. రామగుండంలో 800 మెగావాట్ల పవర్‌ప్లాంట్, సింగరేణి 500మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రం పరిశీలన, సింగరేణి స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌తో పాటు పలు అభివృద్ధి పనుల ప్రారంభం ఈప్రాంతానికి శుభసూచకమన్నారు. రెండు నెలల్లోగా రూరల్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేసి మొదటగా వందమందికి, ఏడాదిలోగా వెయ్యిమందికి ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటామని పేర్కొన్నారు. సింగరేణిలో ఇళ్లు నిర్మించుకున్న 5వేల మందికి ఇంటి స్థలాల పట్టాలు ఇప్పిస్తామన్నారు. ఈమేరకు కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు. అలాగే జెన్‌కో స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న 1600 మందికి పట్టాలిస్తామన్నారు. బహిరంగ సభకు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, రాజిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

వైభవంగా గోదారంగనాయకస్వామి పల్లకిసేవ


కోలాటం ఆడుతున్న మహిళలు

రామగిరి: మండలంలోని లద్నాపూర్‌లో శనివారం గోదారంగనాయక స్వామి పల్లకిసేవ, ఊరేగింపు నిర్వహించారు. ప్రతీ ఏటా శ్రావణ మాసం చివరి వారంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలకు అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ బొల్లపల్లి స్వామిగౌడ్ అధ్వర్యంలో గ్రామంలోని పురవీధుల గుండా మహిళల కోలాట నృత్యాలతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు వనం రాంచందర్‌రావు, బర్ల శ్రీనివాస్, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

'ఖని' దర్శకుడి లఘు చిత్రానికి అవార్డు

గోదావరిఖనిటౌన్: వీకేఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ 24 ఫ్రేమ్ వీడియా ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో శనివారం రాత్రి షార్ట్ ఫిలిం అండ్ ఫోక్ సాంగ్స్ అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహించారు. గోదావరిఖనికి చెందిన దర్శకుడు దామెర శంకర్ దర్శకత్వం వహించి నిర్మించిన మతమా.. మానవత్వమా లఘు చిత్రం బెస్ట్ షార్ట్ ఫిలిం అవార్డును గెలుచుకుంది. అవార్డు రావడంపై కళాకారులు, నటులు అభినందనలు తెలిపారు.

ప్రైవేట్ ఓబీ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

రామగిరి: ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1లో నిర్వహిస్తున్న ప్రైవేట్ ఓబీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఅండ్ఎండీ బలరాం నాయక్‌ను ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి కోరారు. శనివారం రాత్రి సెంటనరీకాలనీకి వచ్చిన సీఅండ్ఎండీని కలిసి విన్నవించారు. నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ పనులు నిర్వహించడంతో కాంట్రాక్టు కార్మికుడు ఆడెపు శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డాడని, ఓబీ కంపెనీ వారు ఎలాంటి నష్టనివారణ చర్యలు చేపట్టకపోవడంతో సదరు కాంట్రాక్టు కార్మికుడి కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలిపారు. సదరు కంపెనీపై చర్యలు తీసుకొని కాంట్రాక్టు కార్మికుడికి న్యాయం చేయాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలపై ఫిర్యాదు

సెంటనరీకాలనీలో సింగరేణి యాజమాన్యం సౌజన్యంతో నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని శనివారం రాత్రి సీఅండ్ఎండీ బలరాం నాయక్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. సెంటనరీకాలనీ పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్ ఉన్నారు.

మీర్జా సిరాజ్‌బేగ్‌కు విద్యా సేవారత్న అవార్డు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ శాంతినగర్‌లోని తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మీర్జా సిరాజ్‌బేగ్‌కు విద్యా సేవారత్న అవార్డును ఘజియాబాద్ న్యూఢిల్లీలో యూపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ జేపీ సింగ్ పంజాబ్, బాలీవుడ్ నటుడు శక్తిమాన్ ముకేశ్ ఖన్నా చేతుల మీదుగా అందించారు. జీఎస్ఎల్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆచార్యదేవోభవ అవార్డ్స్ 2024 విద్యారంగంలో సేవలు అందించి, నాయకత్వ లక్షణాలు కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరారు. మీర్జా సిరాజ్ బేగ్ దరఖాస్తు చేశారు. విద్యారంగంలో ఉత్తమ సేవలందిస్తున్నందుకు ఆదివారం సిరాజ్ బేగ్‌కు అవార్డు అందించారు.

లోతట్టు ప్రాంతాల సందర్శన


రామగుండం: పరిశీలిస్తున్న ఎంపీడీవో అలీం


ముత్తారం: సూచనలు చేస్తున్న ఎస్సై నరేశ్

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో గోదావరి నది పరివాహక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆదివారం అంతర్గాం ఎంపీడీవో ఎంఏ.అలీం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎల్లంపల్లి, ముర్మూర్, లింగాపూర్, పొట్యాల, మద్దిర్యాల తదితర గ్రామాల లోతట్టు ప్రాంతాలను పరిశీలించి వరద నీటి ఉధృతిని పరిశీలించారు. అదేవిధంగా ప్రాజెక్టుకు సమీపంలో ఉన్న ఎల్లంపల్లి కేజీబీవీ పాఠశాలను సందర్శించి వరదనీటి మట్టంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రమాదస్థాయికి వరద నీరు చేరితే విద్యార్థినులను సురక్షిత ప్రాంతాలకు చేరే వేసేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎంపీవో వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

మానేరు పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముత్తారం: మండలంలోని మానేరు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముత్తారం ఎస్సై నరేశ్ కోరారు. మండలంలోని ఓడెడ్ మానేరును ఆదివారం ఆయన పరిశీలించారు. మానేరు అవతలి భూపాలపల్లి జిల్లాకు వెళ్లేవారు, స్థానిక గీతకార్మికులు వెళ్లొద్దని హెచ్చరికలు చేశారు. మానేరు సమీపంలో ఉన్న స్థానికులకు మానేరు వైపు రాకూడదని కౌన్సెలింగ్ చేశారు. ఏదైన ప్రమాదం అనిపిస్తే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. తహసీల్దార్ సుమన్ మానేరు పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కాల్వశ్రీరాంపూర్: కొత్తపల్లి-మల్యాల నక్కలవాగులో మీర్జంపేట గ్రామ పంచాయతీ కారోబార్ పవన్ గల్లంతైన సంఘటనతో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు స్పందించారు. కారోబార్ పవన్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆదివారం రాత్రి పరామర్శించారు. సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. వరదలో సైతం ఎమ్మెల్యే తాడు సాయంతో ఒర్రె వద్దకు చేరుకున్నారు. రెస్క్యూ టీం గజ ఈతగాళ్లను రప్పించాల్సిందిగా జిల్లా ఉన్నతాధికారులను ఎమ్మెల్యే ఫోన్‌లో ఆదేశించారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది. మండల కేంద్రానికి చెందిన మృతురాలి కుటుంబానికి మెట్టు సమ్మక్క కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ శంకర్, సీఐ సుబ్బారెడ్డి, రావు, ఎస్సై వెంకటేశ్, ఏఎస్సై నీలిమ, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, పార్టీ నాయకులు మాదాసు సతీశ్, పొట్యాల మొండయ్య, పోచాల సదానందం, పుప్పాల నాగార్జున్‌రావు ఉన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు సందర్శన


పరిశీలిస్తున్న అధికారులు

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. ఆదివారం వేకువజాము నుంచి గేట్లు ఎత్తిన నీటి పారుదలశాఖ అధికారులు దశల వారీగా 20 గేట్లను ఎత్తడంతో భారీగా వరద నీరు దిగువకు పరవళ్లు తొక్కుతుండడంతో వరద నీటి స్థితిగతులపై మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ సిబ్బందితో ప్రాజెక్టుకు చేరుకొని నీటి పారుదలశాఖ అధికారులతో వరద నీటి స్థితిగతులు తెలుసుకున్నారు. ప్రాజెక్టు వంతెనపై ఇరువైపులా గేట్లు మూసివేసి రాకపోకలు నిలిపివేయాలని ఆదేశించారు.

సంక్షిప్త వార్తలు

● విద్యుత్ సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

పెద్దపల్లిరూరల్: వర్షాల కారణంగా తలెత్తిన విద్యుత్ పరమైన సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్లు 1912, 18004250028 ద్వారా ఫిర్యాదు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పెద్దపల్లి ఎస్ఈ బొంకూరి సుదర్శన్ పాల్గొన్నారు.

● బస్టాండ్ మరమ్మతు పనులు ప్రారంభం

సుల్తానాబాద్: పట్టణంలోని బస్టాండ్ మరమ్మతు పనులు ప్రారంభించారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయంగా షెడ్డు వేసినప్పటికీ వర్షం కురుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

● గుండెపోటుతో మహిళ మృతి

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన మెట్టు సమ్మక్క(50)ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. చాతిలో నొప్పి రావడంతో చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. సమ్మక్క భర్త అంజయ్య పదేళ్ల కిందట తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. పెద్ద కొడుకు రాములు ఫిట్స్ వ్యాదితో 5నెలల క్రితం మృతి చెందాడు. చిన్న కొడుకు లక్ష్మణ్ గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్నాడు.

● చైతన్యపురికాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడిగా సంతోష్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ చైతన్యపురికాలనీలో ఆదివారం చైతన్యపురి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా ఇరుకుల్ల సంతోష్, సెక్రటరీగా గొల్లపల్లి మల్లికార్జున్ గెలుపొందారు. ఎన్నికల్లో ముఖ్య అతిథిగా దయానంద్ గాంధీ, కొమురవెల్లి లింగమూర్తి హాజరై ఎన్నికల విజేతలను ప్రకటించారు. అరుముళ్ల ప్రభుదాస్, ప్రభాకర్, విజయ్, మహేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

● పరామర్శ

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడుర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బెక్కం చిన్నయ్య, శంకర్ కుటుంబాలను ఆదివారం కేశోరాం కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకులు కౌశికహరి పరామర్శించారు. శంకర్, చిన్నయ్యల తల్లి బానమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. వారి ఇంటికి వెళ్లి సంతాపం తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, బత్తిని సతీశ్, బైరి రామకృష్ణ, తిరుపతి, శ్రీధర్, సురేశ్, ప్రసాద్, స్వామి, సాదిక్, మధు, సంతోష్ పాల్గొన్నారు.

● చికిత్స పొందుతూ అధికారి మృతి

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2 ఎస్‌వోటూ జీఎంగా పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్వర్‌రావు(59) ఆదివారం మృతి చెందారు. అనారోగ్య సమస్యతో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా గుండెపోటుతో మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. కాగా ఎస్‌వోటూ జీఎం ఎన్‌వీరావు ఆకస్మిక మృతితో ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, అధికారుల సంఘం నాయకులు సంతాపం తెలిపారు.

జాగ్రత్తలు పాటించండి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియాలో విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మికులు వర్షాకాలం దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని టీబీజీకేఎస్ సంఘం ఆర్జీ-2 ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ సూచించారు. యాజమాన్యం రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.